

మేఘం మీద ఆన..కురవట్లేదు వాన!

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటుతున్నా జిల్లాలో ఇంత వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో..



ఇంతుల కోర్టులోకే రుణాల బంతి

డ్వాక్రా సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాల మంజూరులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పాత బకాయిల వసూలుకు కొత్త రుణాల మంజూరును ముడిపెట్టింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లాలోని వివిధ యాజమాన్యాల్లో ఉన్న జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఈనెల 10వ తేదీ నిర్వహించాలని ఆర్ఐఓ సైమన్ విక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ కేజీబీవీలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు అందరూ మెగా పేరెంట్ టీచర్ మీటింగు వారి కళాశాలల్లో నిర్వహించాలన్నారు.

కత్తి చంద్రయ్య జయంతి సభ రేపు

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్ కత్తి చంద్రయ్య 101వ జయంతి సభ నగరంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించనున్నట్లు జయంతి నిర్వహణ కమిటీ కన్వీనర్ కత్తి కళ్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో కత్తి చంద్రయ్య జీవితాన్ని పరిశోధించి రచించిన 'నా అన్వేషణలో కత్తి చంద్రయ్య' పుస్తకావిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, డీఆర్ఓ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ, డాక్టర్ విజయ రాఘవరావు తదితరులు పాల్గొంటారని, ప్రముఖ సాహితీ విమర్శకులు బీరం సుందరరావు పుస్తకాన్ని సమీక్షిస్తారని తెలిపారు. సభను జయప్రదం చేయాలని కళ్యాణ్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఢిల్లీలో ధర్నా

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతతో ఈ నెల 18, 19 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.బాబు పిలుపునిచ్చారు. 2014లో అమరావతి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ప్రధాన మంత్రి మోదీ చెంబెడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చి పోయారని, ఇపుడు తాజాగా చాక్లెట్ చేతిలో పెట్టి వెళ్లారని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో దేశాన్ని అంబానీ, అదానీలకు కట్టబెట్టే కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, రాష్ట్రాభివృద్ధి కోసం ఎలాంటి నిధులు కేటాయించడం లేదని మండిపడ్డారు. జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించినట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. జిల్లాలో అరకొర నిధులతో నిర్మాణం జరుగుతున్న వెలిగొండ ప్రాజెక్టు, దర్శిలో అర్ధంతరంగా నిలిచిపోయిన డ్రైవింగ్ స్కూలు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ, కడప ఉక్కు పరిశ్రమలకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో జీవనోపాధి కోసం యువకులు పక్క జిల్లాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. జిల్లాను పారిశ్రామికంగా సమగ్రంగా రూపుదిద్దాలన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొని రావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు.

'అల్లూరి' జీవితం ఆదర్శప్రాయం

- ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి నిలిచి, ఎందరో స్వాతంత్ర్యోద్యమ నాయకులకు ఆదర్శంగా నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవితం నేటి కాలంలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. అల్లూరి సీతా రామరాజు 128వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి వీసీ ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఏకేయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్ రావు అధ్యక్షత వహించగా యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలా మణి, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర లతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు లేక.. జీవితాలు చీకటి!



మూతపడిన రావ్ అండ్ నాయుడు క్యాంపస్

కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో ఒంగోలు ట్రిపుల్ ఐటీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఏకపక్షంగా నగరంలోని ఒక క్యాంపస్‌కు మంగళం పాడడంతో విద్యార్థులు, సిబ్బందికి కష్టాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని మిగిలిన ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లతో బిజీబిజీగా ఉంటే ఇక్కడ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో పనిచేస్తున్న రోజువారి వేతన జీవులు జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. ఉన్న ఉద్యోగాన్ని కొనసాగిస్తారా లేదా అన్న ఆందోళన చెందుతున్నారు. వీరిలో అధికార పార్టీ అండదండలున్న వారికి మాత్రం కీలక పోస్టులు కట్టబెట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- కూటమి పాలకుల అడ్డగోలు నిర్ణయాలు
- ట్రిపుల్ ఐటీలో రోజువారీ సిబ్బంది ఆకలి కేకలు
- ఏప్రిల్, మే 18 వరకూ పనిచేసినా జీతాలివ్వని వైనం
- వేసవి సెలవుల తర్వాత కాలేజీకి వెళ్తే లోపలకు రానీయకుండా అవమానం
- వారం రోజుల తర్వాత ఏజెన్సీ ద్వారా పిలుస్తామన్న డైరెక్టర్
- గాలిలో దీపంలా మారిన రోజువారీ వేతన ఉద్యోగుల పరిస్థితి
- ఫ్యాకల్టీల బదిలీల్లో అవకతవకలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులే కాకుండా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఎత్తివేయడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో పాటు ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లో రోజువారీ వేతనం కింద పనిచేస్తున్న సిబ్బంది జీవితాలు గాలిలో దీపంలా మారాయి. చేసిన పనికి కూడా వేతనాలు ఇవ్వడం లేదు. పేరుకు రోజువారీ వేతన ఉద్యోగులే.. ఏ రోజుకారోజు వేతనాలు తీసుకుంటున్నారని అంతా అనుకుంటారు. కానీ, నెలకోసారి కూడా వేతనాలు తీసుకోలేని దయనీయ స్థితిలో బతుకుబండిని భారంగా లాగుతున్నారు. ఇచ్చేది అరకొర జీతం. అది కూడా ఏ రెండు నెలలకోసారో.. మూడు నెలలకోసారో ఇస్తుండటంతో వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయి.

ఏప్రిల్ జీతాలు ఇవ్వకుండానే...

రోజువారీ వేతనాల మీద పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని గత విద్యా సంవత్సరం పూర్తయిన తర్వాత నిలిపేశారు. విద్యార్థులకు మే 8వ తేదీ సెమిస్టర్ పరీక్షలు అయిపోయాయి. తర్వాత వేసవి సెలవులిచ్చారు. మే 18వ తేదీ వరకు కాలేజీ పనిచేసింది. ఆ తర్వాత నుంచి రోజువారీ వేతన సిబ్బందిని విధులకు రావద్దని చెప్పారు. అయితే, అప్పటికే వారికి ఏప్రిల్ నెల వేతనం, మే నెలలో పనిచేసిన 18 రోజుల వేతనం ఇవ్వాల్సి ఉంది. అవేవీ ఇవ్వకుండానే వారిని ఇంటికి పంపించేశారు. ఇప్పుడు విద్యాసంవత్సరం ప్రారంభమైంది. జూన్ 30వ తేదీ వరకు అధికారులు పిలుస్తారేమోనని ఉద్యోగులు ఎదురు చూశారు. కానీ, వారికి ఎలాంటి పిలుపు రాలేదు. జూలై 1వ తేదీ ఎస్ఎస్ఎన్ కాలేజీ వద్దకు వెళ్లారు. అయితే, రోజువారీ వేతన సిబ్బందిని లోపలకు రాకుండా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అప్పుడే, అటుగా వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కనీసం పలకరించకుండా వెళ్లిపోయారు. ఆ తర్వాత వచ్చిన డైరెక్టర్‌తో సమస్య చెప్పుకున్నారు. దాంతో వారం పది రోజుల్లో కొత్త ఏజెన్సీ వస్తుందని, అప్పుడు పిలిపిస్తామని చెప్పి పంపారని తెలిసింది. ఏప్రిల్, మే నెలల వేతనాల గురించి అడిగితే సరే.. చూస్తానంటూ వెళ్లిపోయినట్లు సమాచారం.

ఆ 50 మందికీ ఢోకాలేదు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో సుమారు 50 మంది పచ్చ బ్యాచ్‌ను తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక మంత్రికి సన్నిహితంగా మెలిగే వ్యక్తి అండదండలతో కొత్త అల్లుడిని కూర్చోబెట్టి తినిపించినట్లు వారికి ఎలాంటి పనులు అప్పజెప్పడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఎత్తివేసిన తర్వాత కూడా వారికి ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. అంతేకాదు ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లో వారందరికీ ఆర్థికంగా ప్రయోజనం కలిగించే కీలకమైన పోస్టులు అప్పగించినట్లు సమాచారం. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాత వారి స్థానంలో కొత్తగా పచ్చ బ్యాచ్‌ను తీసుకొస్తారేమోనని పలువురు డైలీ వేజెస్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పని భద్రత లేకపోవడంతో తమ జీవితాలు దినదిన గండంగా మారాయని వాపోతున్నారు.

ఫ్యాకల్టీల బదిలీల్లో అవకతవకలు:

రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో పనిచేస్తున్న ఫ్యాకల్టీల నెత్తిన బదిలీల బండరాయి పడింది. ఈ బదిలీల్లో అనేక అవకతవకలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంజినీరింగ్ క్లాసులు తీసుకునే వారిని ఇంటర్మీడియెట్‌కు వేయడం, ఇంటర్‌కు బోధించే వారిని తీసుకెళ్లి ఇంజినీరింగ్‌కు వేసినట్టు సమాచారం. అలాగే అసలు సబ్జెక్టేలేని ఫ్యాకల్టీని తీసుకెళ్లి పీయూసీకి వేయడం వివాదాస్పదంగా మారింది. ఇలాంటివి ఇంకా అనేక విస్మయం కలిగించే గిమ్మిక్కులు అనేకం జరిగినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కూటమి ప్రభుత్వం ట్రిపుల్ ఐటీని భ్రష్టుపట్టించేందుకు ఎంతగా కంకణం కట్టుకుందో ఈ బదిలీలను చూస్తే తెలిసిపోతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

జీవోలో రూ.607.. ఇచ్చేది రూ.400:

ఒంగోలులోని రెండు క్యాంపస్‌లను కలుపుకుని సుమారు 100 మందికిపైగా రోజువారీ వేతనాల కింద పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారున్నారు. వీరంతా అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది సిఫార్సుల మీద పనిచేస్తున్న వారే ఉన్నట్లు సమాచారం. డైలీ వేజెస్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వీరిలో కొంత మంది దగ్గర నుంచి కాలేజీలో పనిచేస్తున్న అధికారపార్టీ అండదండలున్న ఒక మహిళా ఉద్యోగి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, కలెక్టర్ ఇచ్చిన జీవో ప్రకారం డైలీ వేజెస్ సిబ్బందికి రోజుకు రూ.607 వేతనం ఇవ్వాలి. వీరితో బండచాకిరి చేయించుకుంటున్న అధికారులు కేవలం రూ.400 మాత్రమే చేతిలో పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోనీ అదయినా ఏ నెలకు ఆ నెల ఇస్తున్నారా అంటే అదీ లేదు. రెండు నెలలకోసారి, మూడు నెలలకోసారి మాత్రమే వేతనాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రోజువారీ వేతన ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో సాక్షులచే గుర్తింపు పరేడ్

ఒంగోలు టౌన్: తెలుగుదేశం పార్టీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో శుక్రవారం జిల్లా జైలులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రత్యక్షంగా పాల్గొన్న ముద్దాయి ఓబిలి నాగరాజును ప్రత్యక్ష సాక్షులు గుర్తించేందుకు వీలుగా పరేడ్ నిర్వహించారు. ఒంగోలు–2 ఏఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ పర్యవేక్షణలో పరేడ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

15వ శతాబ్దం నాటి ఆళ్వారుల విగ్రహాలు గుర్తింపు



రాళ్లవాగు ఒడ్డున గుర్తించిన ఆళ్వారుల విగ్రహాలు

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లి వేణుగోపాల స్వామి ఆలయానికి సమీపంలోని రాళ్లవాగు ఒడ్డున ఆళ్వారులకు చెందిన 11 విగ్రహాలను శాసన పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ శుక్రవారం గుర్తించారు. ఈ విగ్రహాలు పట్టణంలోని శివాలయం వద్ద ఒక స్థలం బాగుచేస్తున్న సమయంలో బయటపడ్డాయని, వాటిని ట్రాక్టర్‌లో తీసుకొని వెళ్లి రాళ్లవాగు ఒడ్డున పడవేసి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆళ్వారు స్వాముల విగ్రహాలు 15, 16వ శతాబ్దాల కాలం నాటివి అయి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. శ్రీవైష్ణవ సాంప్రదాయం, తమిళ సాహిత్యంలో ఆళ్వార్లు విశిష్టమైన స్థానం కలిగిన విష్ణు భక్తులు పొయ్‌గై యాళ్వార్, పూదత్తాళ్వార్, పేయాళ్వార్, పెరియాళ్వార్, తిరుమళిశై యాళ్వార్, కులశేఖరాళ్వార్, తిరుప్పాణాళ్వార్, తొండరడిప్పొడి యాళ్వార్, తిరుమంగై యాళ్వార్, ఉడయవర్, నమ్మళ్వార్ 12 మంది భక్తులని ఆయన వివరించారు. 12వ విగ్రహం కనిపించడం లేదని, బయల్పడిన ఈ విగ్రహాలను ఆలయంలో భద్రపరచాలని ఈ ప్రాంతం భక్తులు కోరుతున్నారు.

మళ్లీ అదే పాట..

- ఒంగోలు, కనిగిరిలో చదివా..
- మార్కాపురం జిల్లా ప్రకటన ఊసేలేదు
- సినిమా డైలాగులకు స్పందన నిల్
- పవన్ ప్రసంగిస్తుండగానే కుర్చీలు ఖాళీ
- ప్రైవేటు స్కూళ్ల బస్సుల్లో జనం తరలింపు



పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

మార్కాపురం టౌన్/కొనకనమిట్ల: నేను నాలుగు దశాబ్దాలు కిందట ఒంగోలు, కనిగిరిల్లో చదువుకున్నాను. కనిగిరిలో ఫ్లోరైడ్ వాటర్ ఎక్కువగా ఉండడంతో వెళ్లిపోయామంటూ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మార్కాపురం సభలో పేర్కొనడంపై అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ ప్రాంతానికి రక్షిత మంచినీటిని అందించేందుకు జల్‌జీవన్ మిషన్ కింద రూ.1290 కోట్లు తీసుకువచ్చానని ఆయన చెప్పుకొచ్చారు. వలసలు లేని, తాగునీరు, సాగునీరు ఉన్న ప్రకాశంజిల్లా తన లక్ష్యమన్నారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రక్షిత మంచినీటి కోసం వాటర్ గ్రిడ్ పనులు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే గొట్టిపడియ వద్ద ఇన్‌టెక్‌వెల్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి కూడా. ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో వాటిని కొత్తగా ఈ పనులకు సంబంధించి నిధులు తెచ్చానంటూ ఆయన ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని జనం అంటున్నారు.

ఆకట్టుకోని సినిమా డైలాగులు..

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ప్రసంగంలో చాలాసేపు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీని విమర్శించడమే సరిపోయింది. ఈ సందర్భంగా ఆయన పలు సినిమా డైలాగులు చెప్పారు. సభకు వచ్చిన జనం నుంచి స్పందన కనిపించలేదు. ఆయన ప్రసంగం ఆకట్టుకోకపోవడంతో సభ నుంచి జనం వెళ్లిపోవడం కనిపించింది. సభ ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే సోదరుని కుమార్తె, తన స్నేహితులతో కలసి వీవీఐపీ గ్యాలరీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

మార్కాపురం జిల్లా ఊసేలేదు..



పవన్ కళ్యాణ్ మాట్లాడుతుండగానే వెనుతిరిగి వెళ్తున్న ప్రజలు, మహిళలు

ఎన్నికల ముందుకు కూటమి నాయకులు మార్కాపురాన్ని జిల్లా చేస్తామని హామీ గుప్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా ప్రకటన చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎలాంటి ప్రకటనలు లేవు. పవన్ సైతం తన ప్రసంగంలో జిల్లా ప్రస్తావన తేకపోవడంపై సభకు వచ్చిన జనం తీవ్ర అసహనానికి లోనయ్యారు.

ప్రైవేటు స్కూలు బస్సుల ద్వారా జన సమీకరణ

పవన్‌కల్యాణ్ సభకు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల ద్వారా జనాన్ని తరలించడం వివాదాస్పదంగా మారింది. ప్రతి గ్రామానికి స్కూల్ బస్సులను పంపి మార్కాపురంలో జరిగిన డిప్యూటీ సీఎం సభకు జనాలను తరలించారు. జన సమీకరణకు వాహనాలు కావాలని రవాణాశాఖాధికారులను కూటమి నాయకులు ఆదేశించారు. స్కూల్ బస్సులను సభకు పంపడంతో పలు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



సభకు జనాలను తరలించిన ప్రైవేటు స్కూల్ బస్సులు

చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- సింగయ్య మృతిని కుక్కతో పోల్చడం దారుణం
- ఎస్సీల పై చంద్రబాబు చిన్నచూపు
- దర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దేవ ప్రసాద్



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎస్సీసెల్ నాయకులు

దర్శి: గుంటూరు జిల్లా పల్నాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన చీలి సింగయ్య మృతిని కుక్కతో పోల్చి అసభ్యకరంగా వ్యాఖ్యానించిన సీఎం చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ డిమాండ్ చేశారు. దర్శి పోలీస్ స్టేషన్లో చంద్రబాబు పై కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్సీ సెల్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దేవ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తన ప్రసంగంలో సింగయ్య మృతి గురించి మాట్లాడుతూ కుక్క మాదిరిగా తీసి పక్కన పడేసి వెళ్లిపోయారు అనే పదాలను వాడడం అభ్యంతరకరంగా ఉందన్నారు. ఈ వ్యాఖ్యలు అమానుషమైనవని, అవమానకరమైనవని వ్యాఖ్యానించారు. మొత్తం మాదిగ సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయపరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకి ఎప్పుడూ దళితులంటే చులకనగా మాట్లాడటం అలవాటైందని, ఇప్పటికైనా దళితులకు క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని అవమానకరంగా మాట్లాడారని, దళితులపై ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తికి చిన్నచూపు తగదని హితవు పలికారు. సామాజిక వర్గాల్లో విభేదాలు చూపుతున్న చంద్రబాబుకు పాలించే అర్హత కూడా లేదన్నారు. వెంటనే చంద్రబాబుపై తమ ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు గల్లెపోగు ఏసుదాసు, వివిధ మండలాల ఎస్సీ విభాగం అధ్యక్షులు కేసనపల్లి నాగేశ్వరరావు, యామర్తి ప్రభుదాసు, గోపనబోయిన పెద్ద శ్రీను, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, క్రిస్టియన్ సెల్ కురిచేడు మండల అధ్యక్షుడు ఎం స్టాలిన్ పాల్, నాయకులు కంభంపాటి జోసెఫ్, ఎర్రగుంట్ల మోసే, కే సన్నీ బాబు, బోయలపల్లి అచ్చయ్య, గజ్జ రాజారత్నం, తదితరులు ఉన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ వారు ఇచ్చిన భవిష్యత్‌కు గ్యారంటీ-ఇది బాబు గ్యారంటీ బాండ్‌ను చూపుతున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: మోసానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని, 2014, 2024 ఎన్నికల్లో ఆయన ఇచ్చిన హామీల అమలులో ఈ విషయం రెండు సార్లు రుజువైందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుచేస్తూ చేపట్టే కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు చెప్పేదొకటి... చేసేదొకటి అని ఆరోపించారు. ప్రతిసారి ప్రభుత్వ పథకాలు ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నాడని 2014లో ప్రతి రైతుకు ఎటువంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తానన్నాడని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానన్నాడని, తీరా రైతు రుణమాఫీకి ఆంక్షలు విధించి నామమాత్రంగా చేశాడన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా పసుపు, కుంకుమ కింద రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నాడని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చాడని, ఈసారైనా ఇస్తాడని ఆశగా ప్రజలు ఆయనను గెలిపిస్తే ఈసారి కూడా మోసం చేస్తున్నాడని విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని పథకాలు నామమాత్రంగా ఇవ్వగా, మరికొన్ని పథకాల ఊసే లేదన్నారు. ఇందుకోసం జగనన్న ఆదేశాల ప్రకారం నాలుగు వారాల పాటు నియోజకవర్గంలోని అన్ని మండల, గ్రామస్థాయిలో చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుచేస్తూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సమయంలో భవిష్యత్‌కు గ్యారంటీ–ఇది బాబు గ్యారంటీ అంటూ ప్రతి ఇంటికి రాబోయే ఐదు సంవత్సరాల్లో వారికి తాము అందించే పథకాల ద్వారా ఏమేర లబ్ధి చేకూరుతుందో వివరించే బాండు అందించారని, ఆ బాండును వివరిస్తూ చంద్రబాబు మోసాన్ని ప్రజల కళ్లకు కట్టేలా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేయాలని వివరించారు.

నాడు చేస్తే తప్పు..నేడు చేస్తే ఒప్పా



మార్కాపురానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వచ్చిన హెలికాప్టర్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కలిసేందుకు, సంక్షేమ పథకాలను ప్రారంభించేందుకు హెలికాప్టర్‌లో వస్తే కూటమి నాయకులు హెలికాప్టర్‌లో చక్కర్లు కొడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు ప్రారంభించేందుకు, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడేందుకు జిల్లాల పర్యటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుంటే నాటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తరచుగా విమర్శలు గుప్పించేవారు. అయితే నాడు విమర్శలు చేసిన వారు నేడు పాలకులు కావడంతో ముగ్గురు కలసి తలా ఒక హెలికాప్టర్‌లో రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరిగితే తప్పని విమర్శించినవారు నేడు తలా ఒక హెలికాప్టర్‌లో తిరగడం పట్ల నేడు ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ విమర్శిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 8న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు హెలికాప్టర్ ద్వారా మార్కాపురానికి వచ్చారు. ఇటీవల ఒంగోలులో టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య సందర్భంగా చంద్రబాబునాయుడు, ఆ తరువాత ఆయన కుమారుడు లోకేష్‌లు హెలీకాప్టర్‌లోనే జిల్లాకు వచ్చారు. శుక్రవారం మార్కాపురంలో జరిగిన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా హెలికాప్టర్‌లో మార్కాపురానికి వచ్చారు. నాడు విమర్శించినవారే నేడు హెలికాప్టర్లను ఉపయోగించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లకు నిధులివ్వాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని 135 ఎయిడెడ్ పాఠశాలలకు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకటరావు, ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జూలై 10వ తేదీ నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాల గ్రాంట్ నుంచి 10 శాతం నిధులు వాడుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, కానీ, ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి స్కూల్ గ్రాంట్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదని అన్నారు. తల్లికి వందనం కింద విద్యార్థులకు ఇచ్చే మెయింటెనెన్స్ గ్రాంట్‌ను ఎయిడెడ్ పాఠశాలలకు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి ప్రభుత్వ విద్యార్థులకు ఇచ్చే అన్ని పథకాలు ఎయిడెడ్ విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని కోరారు.

గ్రానైట్ క్వారీలో తనిఖీలు

చీమకుర్తి రూరల్: మండలంలోని హంస మినరల్ గ్రానైట్ క్వారీని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, మండల రెవెన్యూ అధికారి బ్రహ్మయ్య శుక్రవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని బూదవాడ, రాజుపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లోని పలు సర్వే నంబర్లలో విస్తరించి ఉన్న హంస మినరల్ గ్రానైట్ క్వారీ వారు ప్రభుత్వ భూములు, వాగులు ఆక్రమించుకుని అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించినట్లు చెవులూరి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం విచారణ చేపట్టారు. సంబంధిత నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. తనిఖీల్లో మండల సర్వేయర్ మోజెష్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మేఘం మీద ఆన.. కురవట్లేదు వాన!


మార్కాపురంపై ఇటీవల కమ్ముకున్న మేఘాలు

ఆకాశమే గంభీరం.. అన్నదాతల్లో సన్నగిల్లుతున్న ఆత్మస్థైర్యం

- ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తున్న నైరుతి రుతుపవనాలు
- జూన్‌లో సాధారణ వర్షపాతం 43.75 మి.మీ కాగా కురిసింది 40.9 మి.మీ
- అదును దాటి వర్షాలు కురిస్తే తెగుళ్ల బెడద వెంటాడుతుందని ఆందోళన
- జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 4,62,944 ఎకరాలు
- ఇప్పటి వరకు సాగైంది 1687.7 ఎకరాలు
- ప్రారంభం కాని ప్రధాన పంటల సాగు
- అన్నదాత సుఖీభవ పథకం అమలులో సర్కారు వాయిదాల పర్వం
- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు

మార్కాపురం:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చినప్పటికీ జూన్ రెండో వారం నుంచి సరైన వర్షాలు కురవలేదు. జూన్ మాసంలో జిల్లా సాధారణ వర్షపాతం 43.75 మిల్లీమీటర్లు కాగా 40.9 మి.మీ కురిసినట్లు ఐఎండీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం వర్షం జాడ లేక పొలాలు పదునెక్కలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పొలాలను దుక్కి దున్నిన రైతులు పదును వాన పడితే పంటలు సాగు చేసేందుకు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసినా వర్షాలు లేకపోవడంతో రైతులతో కలకలలాడాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులు వెలవెలబోతున్నాయి. వర్షం కురిస్తే రైతులు పత్తి, మిర్చి, కంది, సజ్జ, కొర్ర, ఆముదం, జొన్న తదితర పంటలు సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అదునుదాటి వర్షాలు కురిస్తే పంటలకు తెగుళ్లు సోకి పెట్టుబడి వ్యయం ఎక్కువవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


చుక్కనీరులేని వేములకోట చెరువు

పెట్టుబడి సాయమేది?

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటల పెట్టుబడికి ప్రభుత్వం అందించే సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పంటల సాగుకు ముందే పెట్టుబడి సాయం అందించడంతో రైతులకు కొంత మేర ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తామన్న అన్నదాత సుఖీభవ పథకాన్ని వాయిదాల మీద వాయిదాలు వేస్తోంది. ఎకరా పత్తి సాగు చేయాలంటే రూ.50 వేలు, మిర్చికి సుమారు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దీంతో రైతులు అప్పు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

సాగు అత్యల్పం!

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో పంటల సాగు లక్ష్యం 4,62,944 ఎకరాలు కాగా ఇప్పటివరకు జిల్లాలో సుమారు 1700 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగు చేశారు. ప్రధానంగా వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి, కొర్ర, మినుములు, పెసలు, కంది తదితర ప్రధాన పంటలు సాగు కాలేదు. వరి 12,826 హెక్టార్లు, సజ్జ 7,020, మొక్కజొన్న 3,120, కొర్ర 1,337, పెసలు 949, మినుములు 2,456, కంది 68,287 హెక్టార్లు, నువ్వులు 3,457, ఆముదం 1,537, పత్తి 26,981, మిర్చి 25,217 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు సజ్జ 88, ఆముదం 10, పత్తి 287, నూగులు 6 హెక్టార్లలో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కూరగాయలు 237 హెక్టార్లలో సాగవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం మీద ఖరీఫ్ సాగు ఆశాజనకంగా లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.


దుక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

వాన పడితేనే పంటలేస్తాం



ఈ ఏడాది జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. పొలాలన్నీ దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నాం. వర్షం పడితే పత్తి, సజ్జ, కంది పంటలు వేసేందుకు అనువుగా ఉంటుంది.

– టి.రామిరెడ్డి, రైతు

భర్త వేధిస్తున్నాడంటూ భార్య నిరసన



భర్త ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేస్తున్న ఇందిర

ఒంగోలు టౌన్: వివాహమై 30 ఏళ్లయినా తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని తనను, పిల్లలను పట్టించుకోకుండా వేధిస్తున్నాడంటూ ఓ మహిళ నిరసన వ్యక్తం చేసింది. భర్త పనిచేస్తున్న స్థానిక రాజాపానగల్ రోడ్డులోని యూనియన్ చెస్ బ్యాంక్ వద్ద అతని ఫొటోతో కూడిన ఫ్లెక్సీ పట్టుకుని ఆందోళనకు దిగింది. బాధితురాలి కథనం ప్రకారం... గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని వల్లభరావుపాలేనికి చెందిన ఇందిరకు ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన తొట్టెంపూడి పోలయ్యతో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం కాగా, పోలయ్య ఒంగోలులోని ఓ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 30వ తేదీ రిటైర్డ్ కాబోతున్నాడు. ఆయన కొంతకాలంగా ఇతర మహిళలతో వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నాడని, ప్రస్తుతం ఒక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మహిళతో ఉంటున్నాడని ఇందిర ఆరోపించింది. ఒంగోలు నగరంలోని సుజాతనగర్‌లోని ఓ ఇంట్లో ఆమెతో కలిసి సహజీవనం చేస్తూ తనను, పిల్లలను బయటకు గెంటేశాడంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తనతో విడాకులు కోరుతూ కోర్టులో కేసు కూడా వేశాడని తెలిపింది. తనకు, తన పిల్లలకు న్యాయం చేయాలని, అతని సర్వీసు రికార్డులో తన పేరు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఇప్పటికే పోలయ్యపై ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశానని, దిశ పోలీస్‌స్టేషన్‌కు రిఫర్ చేశారని తెలిపింది. తన భర్త మీద చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరింది.

ఇంతుల కోర్టులోకే రుణాల బంతి!



పాత బకాయిలు రూ.16 కోట్లు చెల్లించాకే కొత్తవంటూ మెలిక

- స్త్రీనిధి రుణాల కోసం డ్వాక్రా మహిళల ఎదురుచూపులు
- మూడు నెలలుగా రుణం మంజూరు కాక మహిళల అవస్థలు
- హెచ్‌ఎల్‌పీ-ఎంసీపీ యాప్‌లో సభ్యుల వివరాల నమోదుతో మరింత ఆలస్యం

జిల్లాలో డ్వాక్రా సభ్యులు 4,54,628	గ్రామ సమాఖ్య సంఘాలు 1,541
డ్వాక్రా సంఘాలు 45,062	బయోమెట్రిక్ పూర్తయిన గ్రూపులు 34,814

బేస్తవారిపేట: డ్వాక్రా సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాల మంజూరులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పాత బకాయిల వసూలుకు కొత్త రుణాల మంజూరు ప్రక్రియకు ముడి పెట్టడంపై మహిళలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎల్‌పీ-ఎంసీపీ యాప్‌లో వివరాల నమోదులో కొనసాగుతున్న జాప్యం రుణాల మంజూరుకు మరో అడ్డంకిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థల ఉచ్చులో చిక్కుకోకుండా, వారి జీవనోపాధి కోసం ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీనిధిని ఏర్పాటు చేసింది. చిన్న హోటళ్లు, కిరాణ దుకాణాలు, కూరగాయలు పండించడం-విక్రయించడం, పేపర్ ప్లేట్ల తయారీ, టైలరింగ్ లాంటి వ్యాపారాలు, వృత్తులు చేసుకునే స్వయం సహాయక సంఘాల మహిళలకు చిన్నచిన్న మొత్తాల్లో స్త్రీనిధి బ్యాంకు రుణాలు అందిస్తుంది. మూడు నెలల క్రితం వరకు రుణం అవసరమైన డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి యాప్‌లో వివరాలు నమోదు చేసి, బ్యాంకుల నుంచి కావాల్సిన రుణం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం హెచ్‌ఎల్‌పీ-ఎంసీపీ యాప్(హౌస్‌హోల్డ్ లవులీఉడ్ ప్లాన్-మైక్రో క్రెడిట్ ప్లాన్)లో గ్రూప్ సభ్యులందరి జీవనోపాధి వివరాలు నమోదు చేసి బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ గత మూడు నెలలుగా కొనసాగుతుండటంతో స్త్రీనిధి రుణాలు మంజూరు చేయకుండా నిలిపివేశారు. జిల్లాలో రూ.16 కోట్ల మేర స్త్రీనిధి రుణాల బకాయిలు వసూలయ్యే వరకు కొత్త రుణాలు మంజూరు చేసేది లేదని చెబుతుండటంతో అర్హులైన మహిళలు విస్తుపోతున్నారు. సకాలంలో రుణాలు అందకపోవడంతో చిన్న చిన్న అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకోవాల్సి వస్తోందని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరు వ్యాపారం చేసుకునే మహిళలు పెట్టుబడి కోసం, అలాగే కళాశాలలు తెరవడంతో తమ పిల్లల ఫీజులు, పుస్తకాల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ మహిళలకు ఉన్నతి కింద సున్నా వడ్డీకే స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తారు. ఈ నేపథ్యంలో ఎస్సీ మహిళలు నెలల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని పొదుపు సంఘాల మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.


బేస్తవారిపేటలో మహిళా సమాఖ్య భవనం

స్త్రీనిధి రుణాలు తీసుకున్న వారి నుంచి రికవరీ సరిగా లేదు.

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.1.60 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీఓఏలు సక్రమంగా రుణాలు కట్టించడంలేదు. కొన్ని గ్రామ సంఘాల సభ్యులు రెండు నుంచి మూడేళ్లుగా రుణాలు చెల్లించడం లేదు. ప్రస్తుతం రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– రాజేశ్వరి, గిద్దలూరు క్లస్టర్ స్త్రీనిధి మేనేజర్

బస్టాండ్‌కూ పచ్చ రంగు



గతంలో పెద్దపవని బస్టాండ్


ప్రస్తుతం పెద్దపవని బస్టాండ్

వలేటివారిపాలెం(లింగసముద్రం): గుడి, బడి, శ్మశానం, పంచాయతీ ఇలా ఒకటేమిటి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పచ్చ రంగు వేసి టీడీపీ నేతలు ఆనందం పొందుతున్నారు. నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలంలోని పెద్దపవని గ్రామంలో ఉన్న బస్టాండ్‌కు ఇటీవల పచ్చ రంగులు వేశారు. దీనిని చూసిన ప్రయాణికులు, గ్రామ ప్రజలు ఇదెక్కడి పచ్చపైత్యమని ముక్కున వేలేసుకుంటున్నారు.

చెట్టుపై నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతుడు నాగభూషణం

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): చెట్టుపై నుంచి జారి పడటంతో తీవ్రగాయాలపాలై ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం వెలిగండ్ల మండలంలోని గుడిపాటిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. గుడిపాటిపల్లి గ్రామానికి చెందిన గోనా నాగభూషణం(53) చెట్లు కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రగాయలయ్యాయి. క్షత గాత్రుడిని కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

ఏకేయూ అడ్మిన్ స్థానాల్లో మార్పులు


ప్రొఫెసర్లకు నియామక పత్రాలు అందిస్తున్న రిజిస్ట్రార్

ఒంగోలు సిటీ: ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సూచనల మేరకు పలు అడ్మిన్ స్థానాల్లో మార్పులు చేసినట్లు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి. హరిబాబు శుక్రవారం తెలిపారు. ఏకేయూ నూతన ఓఎస్డీగా ప్రస్తుత ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావును, ప్రస్తుత వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, వైస్ ప్రిన్సిపాల్‌గా, అలాగే సీఈగా పనిచేస్తున్న డాక్టర్ కేవీఎన్ రాజుకు సీడీసీ డీన్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత మార్పుచేర్పులు 4వ తేదీ నుంచే అమలులోకి వచ్చాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. నూతనంగా విధుల్లో చేరనున్న అడ్మిన్లు ఈ పదవుల్లో తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు కొనసాగుతాయని రిజిస్ట్రార్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా అడ్మిన్ స్థానాలు పొందిన ప్రొఫెసర్లకు వీసీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు తదితరులు నియామక పత్రాలు అందజేసి అభినందించారు.